# హక్కును నిర్వచించిన సిద్ధాంతకర్త

శ్రీవత్స

మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ కె. బాలగోపాల్ గురువారం ఆకస్మిక మృతికి గురికావడం పట్ల దేశంలోని ప్రజాతంత్ర వాదులు, హక్కుల కార్యకర్తలు, అభిమానులు, ఆదివాసీ, దళిత, గిరిజన ప్రజలు తమ ఆత్మీయున్ని కోల్పోయిన భావనలో గొల్లుమన్నారు. బాలగోపాల్ అనంతపురం జిల్లాలోని కంబదూరు రాళ్ళ అనంతపురం ప్రాంతానికి చెందినవారు. విద్యాభ్యాసం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి వరంగల్‌లోని రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో గణితశాస్త్రంలో పిహెచ్‌డి పూర్తి చేసారు. అనంతరం 1980లో కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా ఉద్యోగంలో చేరి అనతికాలంలోనే సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాల పట్ల పెల్లుబుకిన నిరసన, విప్లవ ఉద్యమాలతో పరోక్ష సంబంధాలు నెరపి 1985లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి హక్కుల ఉద్యమానికి పూర్తిగా అంకితమైనాడు. ఇదే తరహాలో బాలగోపాల్‌పై కూడా దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లకు పాల్పడ్డ సందర్భాలు ఉన్నాయి. సమాజంలోని అసమానతలను పారదోలడానికి హక్కుల ఉద్యమం ఇంకా అనేక కోణాల్లో విస్తృత రూపాన్ని తీసుకోవల్సిన అవసరం ఉందని, ప్రజలు ఎదుర్కొంటున్నది కేవలం రాజ్యహింస మాత్రమే కాదని, ప్రైవేటు హింస కూడా ఎదుర్కొంటున్నారని కాబట్టి వీటన్నింటిపై హక్కుల సంఘం పోరాడాల్సిన అవసరం ఉందని పౌరహక్కుల సంఘంలో క్రియాశీలకంగా పని చేస్తూనే 1996 వరకు పలుదఫాలుగా చర్చపెట్టిన అనంతరం ఏకాభిప్రాయం కుదరని కారణంగా పౌరహక్కుల సంఘంనుండి తనతో పాటు డాక్టర్ బుర్రా రాములు, ఎస్.జీవన్‌కుమార్, తదితర 30 మంది కార్యకర్తలతో బయటకు వచ్చి 1997 సంవత్సరంలో మానవహక్కుల వేదిక అనే హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఉత్తర తెలంగాణలో కనీసం సమస్యలపై సదస్సులు, అమరులైన సామాజిక ఉద్యమకారుల సంస్మరణ సభలు, సంతాప సభలు పెట్టుకోవడానికి కూడా రాజ్యం నిరాకరిస్తున్న పరిస్థితులల్లో కూడా ఏ మాత్రం వెనకడుగు వేయకుండా సంఘ కార్యక్రమాలను ముందుకు నడిపించాడు.

## నిరంతర అన్వేషణ ఆయన నైజం

బాలగోపాల్‌కు దేశంలోని కాశ్మీర్‌నుండి కన్యాకుమారి వరకు గల భౌగోళిక, నైసర్గిక విషయాలపై ఆయా ప్రాంతాల ప్రజల సామాజిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక స్థితిగతులపై, సమస్యలపై సంపూర్ణ అవగాహన కల్గిన మేధావి. ఇంతటి మేధోసంపత్తి కలిగిన వారు మనదేశంలో అరుదనే చెప్పవచ్చు. మూడు దశాబ్దాలపాటు కొనసాగిన హక్కుల ఉద్యమంలో పీడిత ప్రజల హక్కుల దరువై



మ్రోగాడనడంలో అతిశయోక్తిలేదు. మనదేశంలో నెలకొనిఉన్న ఆధిపత్య వర్గాల అణచివేతకు, అధికారం కొరకు కొందరు, అధికారం నిలుపుకోవడానికి మరికొందరు రాజకీయంగా ఎంతకైనా దిగజారుతున్న సందర్భాల్లో ఉల్లంఘించబడుతున్న ప్రజల హక్కుల పరిరక్షణకు నడుంబిగించిన బాలగోపాల్ కృషి అసాధారణమైనది. రెండు దశాబ్దాలకుపైగా కొనసాగుతున్న రాజ్యహింస, ఎన్‌కౌంటర్లపై స్పందించడమేకాక వాటిలో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం క్రింద కేసునమోదు చేయాలని సుదీర్ఘకాలం పాటు పోరాటంచేసి సాధించిన ఘనత చరిత్రలో నిలిచిపోతుంది. వెనువబడ్డ ప్రాంతాల ప్రజల సంస్కృతిని సాంప్రదాయల పట్ల హేళన, వనరుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేయడం ఆ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష అనే కోణంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికై, దేశంలో రైతులను కూలీలుగా మార్చి, కూలీలను బిక్షగాల్లుగా మార్చే స్పెషల్ ఎకనామిక్ జోన్ వంటి వాటి పట్ల, ఆదివాసీల హక్కులను, ప్రాణాలను హరించివేసే బాక్సైట్ గనుల తవ్వకాల విషయంలో, భూగర్భజలాలు అడుగంటిపోయి కనీసం త్రాగునీరు, సాగునీరు లేక గ్రామాలకు గ్రామాలను విధ్వంసానికి గురిచేసే ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాలపైనే కాక జాతీయ స్థాయిలో గుజరాత్‌లో మతఘర్షణలు, ఉగ్రవాదం పేరిట జమ్మూ కాశ్మీర్‌లో జరుగుతున్న ప్రజల హక్కుల ఉల్లంఘన, వివక్షతో కూడిన జలవిధానాల వల్ల ఏర్పడిన ప్రాంతీయ జలవివాదాలపైనే కాక అంతర్జాతీయంగా సామ్రాజ్య విస్తరణలో భాగంగా పోలీస్‌పాత్ర పోషిస్తున్న అమెరికా విదేశాంగ విధానాలపై, దాని దాడులవల్ల నష్టపోయిన దేశాలకు సంఘీభావం తెలుపడంలో దేశంలోని ప్రజాతంత్ర వాదులను కలుపుకొని ఉద్యమించిన గొప్పమానవతావాది బాలగోపాల్.